క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



సుభాష్‌నగర్: సంత్ రవిదాస్ జయంతిని పురస్కరించుకొని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నగరంలోని నాగారం ఇంద్రపురికాలనీలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. బలవంతపు మతమార్పిడులకు వ్యతిరేకంగా సంత్ రవిదాస్ భక్తి ఉద్యమాన్ని నడిపించారని పేర్కొన్నారు. వైద్యశిబిరం ఏర్పాటుకు సహకరించిన అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్, శ్రీ చక్ర ఆస్పత్రి, డాక్టర్ విశ్వతేజకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సందీప్‌కుమార్, నాయకులు సాయిపవార్, కిరణ్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఐక్యతా మహాసభలు



ఖలీల్‌వాడి: ఖమ్మంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న ఐక్యతామహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి సుధాకర్ కోరారు. నగరంలోని ఎన్‌ఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మంలో వేలాది మందితో భారీ ర్యాలీ, బహిరంగసభ నిర్వహిస్తామని, 4,5 తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. సమావేశంలో పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు విఠల్, లింగం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ




మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని తాడెంలో సీసీ రోడ్డు పనులకు బోర్గాం(పి) సొసైటీ మాజీ చైర్మన్ సూర్యారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు నారాయణరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. గ్రామస్తులు విజయ్, శ్రావణ్, రాజేశ్వర్, కిరణ్, పంచాయతీ కార్యదర్శి ధీరజ్ పాల్గొన్నారు.

ఒత్తిడిని తగ్గించుకోవాలి




నిజామాబాద్ సిటీ: పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవాలని ప్రముఖ మానసిక వైద్యుడు ఆకుల విశాల్ సూచించారు. ఒత్తిడిని జయించడంపై నగరంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. మానసిక ప్రశాంతతను పెంపొందించుకునేందుకు పరీక్షల సమయంలో ధ్యానం, సంగీతం ఒక అద్భుతమైన మార్గమన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వీరబ్రహ్మం, ప్రాజెక్ట్ చైర్మన్ కోటగిరి చంద్రశేఖర్, సభ్యులు ముక్క శ్రీనివాస్, సంపత్, సూర్యప్రకాశ్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగలక్ష్మి, డీఎస్‌సీడీసీ శశికళ, ఏఎస్‌సీడీవో భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారెడ్డికి సన్మానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన జి చిన్నారెడ్డిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి శుక్రవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు ఉన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



ధర్పల్లి: మండలంలోని సీతాయిపేట్ ప్రభుత్వ పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో బాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడారు. రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని, ప్రతిరోజూ భోజనాన్ని పరిశీలించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు.

నేటినుంచి ప్రజాపాలన సేవా కేంద్రాలు

- జోన్ కార్యాలయాల్లో అందుబాటులోకి..
- ప్రత్యేకంగా కంప్యూటర్లు, ఆపరేటర్లు
- అవసరమైన సిబ్బంది సర్దుబాటు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను అర్హులకు అందించేందుకు నగరంలోని జోన్ కార్యాలయల్లో శనివారం నుంచి సేవా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఆరు గ్యారంటీలు అందని వారు, దరఖాస్తు చేయడంలో సమస్యలు ఎదుర్కొంటున్న వారు సేవా కేంద్రాల్లో నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరు జోన్ కార్యాలయాల్లో సేవా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేశారు.

ప్రజాపాలన దరఖాస్తులతో రావాలి

ఆరు గ్యారంటీలను పొందడంలో ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే ప్రజలు ప్రజాపాలన దరఖాస్తుతో ఆయా జోన్ కార్యాలయాల్లో సంప్రదించాలని అధికారులు చెబుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తును పరిశీలించి సేవాకేంద్రం సిబ్బంది సమస్యను పరిష్కరిస్తారు.



నగరంలోని జోన్ -4 కార్యాలయం

సంక్షేమ పథకాలు సత్వరమే అందించేందుకు..

నగరంలో 60 డివిజన్లు ఉండగా, ఆరు జోన్‌కార్యాలయాలు, సుమారు 4లక్షల జనాభా ఉంది. జోన్-1(నాందేవ్‌వాడ), జోన్-2(గోల్‌హనుమాన్), జోన్-3(పెద్దబజార్), జోన్-4ఏ(రాజీవ్‌గాంధీఆడిటోరియం), జోన్-4బీ(కంఠేశ్వర్), జోన్-5(అర్సపల్లి)లో కార్యాలయాలున్నాయి. ఆయా జోన్ల పరిధిలో ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించి ఏఈలే బాధ్యత వహించనున్నారు. ఆరు గ్యారంటీల అమలు కోసం కోసం జోన్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లను, అవసరమైన సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసింది. గృహజ్యోతి పథకంతో 200 యూనిట్లలోపు అర్హులకు విద్యుత్ బిల్లు జీరో కానుంది. రూ. 500లకే సిలిండర్లు ఇవ్వనున్నారు.

ప్రజల కోసమే..

నగర ప్రజల కోసమే ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఆరుగ్యారంటీలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సేవా కేంద్రాల్లో పూర్తి సమాచారం లభిస్తుంది. గతంలో దరఖాస్తులు చేసుకోకపోయినా, కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు సేవా కేంద్రాలు ఉపయోగకరంగా ఉంటాయి. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తారు. – మంద మకరందు, మున్సిపల్ కమిషనర్

పసుపు బోర్డు బీజేపీ ఎన్నికల స్టంట్



మాట్లాడుతున్న కే నగేశ్‌రెడ్డి

- పసుపు ధరపై ఎంపీ అర్వింద్ గొప్పలు హాస్యాస్పదం
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి

డిచ్‌పల్లి: జిల్లాలో పసుపుబోర్డు ఏర్పాటు హామీ బీజేపీ ఎన్నికల స్టంట్ మాత్రమేనని ఏఎంసీ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కే.నగేశ్‌రెడ్డి విమర్శించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు ధరపై గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు ధర క్వింటాల్‌కు రూ.17,250 పలికినట్లు తెలిపారు. పసుపు పంటకు మరింత ఎక్కువ ధర ఇప్పించేందుకు మహారాష్ట్ర లోని సాంగ్లి పసుపు మార్కెట్‌కు నిజామాబాద్ కలెక్టర్ ఆధ్వర్యంలో రైతులు, అధికారులను తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్నికలు రాగానే వచ్చే రెండేళ్లలో పసుపునకు రూ.20వేలు ధర ఇప్పిస్తానని ఎంపీ అర్వింద్ మరోసారి బాండ్ పేపర్ రాసిస్తానని రైతులను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఎంపీలుగా కల్వకుంట్ల కవిత, అర్వింద్ చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. డిచ్‌పల్లి స్టేషన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం హామీగానే మిగిలిపోయిందని, మాధవనగర్ ఆర్‌వోబీ కాంగ్రెస్ హయాంలోనే మంజూరైందన్నారు. ప్రజలు బీజేపీ, బీఆర్‌ఎస్ నాటకాలను గమనిస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ నాయకులు కంచెట్టి గంగాధర్, డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, నాయకులు గురడి నర్సారెడ్డి, న్యాస రాజేశ్వర్, డాక్టర్ షాదుల్లా, పులి వెంకటేశ్వరరావు, యానంపల్లి మురళి, ఇబ్రహీం, రాజు, గంగారాం, శ్రీనివాస్, నరహరి, రాము, సాంసన్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయంగా పని చేయాలి



నిజామాబాద్ రూరల్: మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ మారుతి అన్నారు. మండలంలోని పాంగ్రా గ్రామ మహిళా సమాఖ్య భవనంలో మోపాల్, రూరల్ ఉమ్మడి మండలాల విలేజ్ ఆర్గనైజర్ ఆఫీసర్ల (సీఏ) ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. లక్‌పతి దీదీ అంశంపై గ్రామాల్లో శిక్షణ నిర్వహించాలన్నారు. నెలకు రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చే ఉపాధి అవకాశాలను గుర్తించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మహిళలకు అందించే రుణాల ప్రణాళికలను రూపొందించి మహిళల ఆర్థిక ఎదుగుదలకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం రవికుమార్, ఏపీఎం మహేశ్, మోహన్, సీసీలు పాల్గొన్నారు.

చలో మేడిగడ్డకు తరలిన నాయకులు

ఇందల్వాయి : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన చలో మేడిగడ్డ కార్యక్రమానికి మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలివెల్లారు. మేడిగడ్డకు వెళ్లినవారిలో ఎంపీపీ రమేశ్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు చెలివేరి దాసు, నాయకులు పాశం కుమార్, ఆరెట్టి రఘు తదితరులున్నారు.

పిల్లలకు పండ్లు పంపిణీ



సుభాష్‌నగర్: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ జన్మదినం సందర్భంగా నగరశివారులోని డెఫ్ అండ్ డెమ్ స్కూల్‌లో విద్యార్థులకు నాయకులు శుక్రవారం పండ్లు, బిస్కెట్లు, పంపిణీ చేశారు. అంతకుముందు కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. రవికుమార్, దుబాయ్ శీను, కార్తీక్‌గౌడ్, సతీశ్, నరేశ్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని డంపింగ్‌యార్డులో ధర్మకాంట పని చేయని వైనంపై 'చెత్త తూకం వేసేదెలా..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ డంపింగ్‌యార్డును శుక్రవారం పరిశీలించారు. ధర్మకాంట ఎన్నిరోజుల నుంచి పనిచేయడం లేదని ఆరా తీశారు. డంపింగ్‌యార్డు పరిసరాలను పరిశీలించారు.



డంపింగ్‌యార్డు రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్

త్వరలోనే ధర్మకాంటను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారని డంపింగ్ యార్డు ఇన్‌చార్జి సాల్మన్‌రాజ్ తెలిపారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవీందర్

డిచ్‌పల్లి: వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీందర్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ ధర్మేంద్ర, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీధర్‌తో కలిసి గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. తాగునీటి పంపిణీని సక్రమంగా చేపట్టేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. అవసరమైన చోట బోరు మోటార్లు అద్దెకు తీసుకుని ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని సూచించారు.

అర్హత మార్కులు తగ్గించాలి



సుభాష్‌నగర్: ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్)లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థులకు అర్హత మార్కులు తగ్గించాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు టీజేఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి విన్నవించారు. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అర్హులైన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని నిజామాబాద్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అకౌంటెంట్ పోస్టు భర్తీకి బ్యాక్‌లాగ్ రోస్టర్ పాయింట్(6)లో అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ సుప్రజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కామర్స్ సబ్జెక్టులో డిగ్రీ, బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ లేదా బీకామ్ కంప్యూటర్స్, పీజీ (ఎం.కామ్) విద్యార్హతలు కలిగి ఉండాలని సూచించారు. ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తుఫారాలను కేజీబీవీలో అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 76748 24361 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని బోర్గాంలో 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో 33 కేవీ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర ఏడీఈలు 1,2,3 చంద్రశేఖర్, తోట రాజశేఖర్, వీరేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని తిలక్ గార్డెన్ పవర్ హౌస్, వినాయక్‌నగర్, బోర్గాం, అర్సపల్లి, దుబ్బ, మిర్చీకంపౌండ్, సుభాష్‌నగర్, ముబారక్‌నగర్, గూపన్‌పల్లి ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు తైబజార్‌కు టెండర్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని తైబజార్‌కు శనివారం టెండర్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మకరందు శుక్రవారం తెలిపారు. తైబజార్‌తోపాటు మటన్, స్లాటర్‌హౌజ్‌లకు సంబంధించిన వాటికి టెండర్లు నిర్వహించనున్నారు.

రేపు అసురవేదం నాటిక ప్రదర్శన

నిజామాబాద్ సిటీ: భరతముని జయంతి ఉత్సవాల సందర్భంగా సంస్కార భారతి ఇందూర్ ఆధ్వర్యంలో అసురవేదం నాటికను బోర్గాం(పీ)లోని సాహితీ విద్యానికేతన్‌లో ఆదివారం ప్రదర్శించనున్నట్లు సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.45 గంటలకు సాహితీ విద్యానికేతన్ బాలబాలికలు నాటికను ప్రదర్శిస్తారని, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా డోలారోహణం



నిజామాబాద్ రూరల్ : అనంతపద్మనాభస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని మల్కాపూర్ (ఏ), లక్ష్మపూర్ గ్రామాల వీడీసీల ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారికి డోలారోహణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మల్కునూరి రమణాచారి, మల్కాపూర్, లక్ష్మాపూర్ వీడీసీల అధ్యక్షులు ఇసాంపల్లి చిన్నగంగారాం, రాంరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా నవమ వార్షికోత్సవాలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఎల్లమ్మగుట్టలో ఉన్న ఎల్లమ్మదేవి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం బోనాల పండుగ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పంచరెడ్డి ఎర్రన్న, ప్రధాన కార్యదర్శి పంచరెడ్డి చిన్నశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి ఒడ్డెపు ప్రభాకర్, బొబ్బిలి వేణు, ఆలయ ప్రధాన అర్చకుడు గోపిరాజ్ వెంకటేశ్వరశర్మ, స్థానికులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..



కంఠేశ్వర్ చౌరస్తాలో పనిచేయని సిగ్నల్స్

పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్

నగరంలోని కంఠేశ్వర్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పనిచేయడం లేదు. దీంతో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. రోడ్డు దాటాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నీటి సమస్యకు పరిష్కారం చూపాలి



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

- గిరిజన సంక్షేమ అధికారికి అర్బన్ ఎమ్మెల్యే ఆదేశం

సుభాష్‌నగర్: నగరంలోని గిరిజన వసతిగృహంలో నెలకొన్న నీటి సమస్యకు వారం రోజుల్లో పరిష్కారం చూపాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గిరిజన సంక్షేమాధికారిని ఆదేశించారు. నాందేవ్‌వాడలోని గిరిజన వసతిగృహాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో కనీస వసతులు కరువయ్యాయని, భోజనం సరిగ్గా ఉండటం లేదని, ప్రతిరోజూ ఒకే కూర వండుతున్నారని, నీటి సమస్య తీవ్రంగా ఉందని, మున్సిపల్ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని విద్యార్థులు ఎమ్మెల్యేకు సమస్యలను తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే గిరిజన సంక్షేమాధికారితో ఫోన్‌లో మాట్లాడారు. కనీస సౌకర్యాలు లేవని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని, నీటి కొరతకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. వారం రోజుల్లో మరోసారి వసతిగృహాన్ని తనిఖీ చేస్తానని, వెంటనే సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని స్పష్టంచేశారు. ఆయన వెంట కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, పంచరెడ్డి ప్రవళిక, నాయకులు ప్రభాకర్, పవన్, తదితరులు ఉన్నారు.

బ్లడ్ బ్యాంకు ప్రారంభం



బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ద్వారకానగర్‌లో భువన సమేక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందూర్ బ్లడ్ బ్యాంకును ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. బ్లడ్‌బ్యాంకు యాజమాన్యాన్ని అభినందించారు. బ్లడ్ బ్యాంకు యాజమాన్యం డాక్టర్ దామోదర్ రావు, డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ రాజేశ్, డాక్టర్ జీవన్‌రావు, డాక్టర్ వినయ్ శ్రీవాణి ధన్‌పాల్, డాక్టర్ రాఘవేంద్ర స్రవంతి , కార్పొరేటర్లు బైకాన్ మధు, ప్రభాకర్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,250	వెండి (కిలో)	74,600
22 క్యారెట్స్	59,246	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సడ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	08	16	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	70	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	50	70	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	45	65	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	35	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	వ్యూహం (తెలుగు) - 10.55 ఊరు పేరు భైరవ కోన - 01.30, సమరసింహా రెడ్డి - 4.30, ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 7.30, 10.30
స్క్రీన్-2	చారి-111 (తెలుగు) - 11.00, 1.40, హనుమాన్ - 4.30, వ్యూహం - 4.30, కిక్ (తెలుగు) - 10.30
స్క్రీన్-3	మా ఊరి రాజారెడ్డి (తెలుగు) - 10.30, ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 1.30, భూతద్దం భాస్కర్ - 4.20, 10.20, ఊరుపేరు భైరవ కోన (తెలుగు) - 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 11.00, 1.55, 4.50, 7.45, 10.40
స్క్రీన్-2	డ్యూన్ - 2 (ఇంగ్లిష్) - 10.00, చారి 111 - 1.35, 10.10, వ్యూహం - 4.25, భూతద్దం భాస్కర్ (తెలుగు) - 7.10
స్క్రీన్-3	భూతద్దం భాస్కర్ (తెలుగు) - 12.10, డ్యూన్-2 (ఇంగ్లిష్) - 3.10, 6.40, 10.10
స్క్రీన్-4	ఇంటి నెం.13 (తెలుగు)-1.05, కిక్ - 3.50, ఆర్టికల్ 370 (హిందీ) 7.15
దేవి	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)
నటరాజ్	ఇంటి నెం. 13 (హిందీ)
లలితామహల్	సమరసింహా రెడ్డి - 11.00, 9.15 కిక్ (తెలుగు) - 2.15, 6.00
విజయ్	ఊరు పేరు భైరవకోన (తెలుగు)